క్లుప్తంగా

క్రికెట్ టోర్నీలో రామాంజనేయులు ప్రతిభ



సత్తెనపల్లి: బెంగళూరులో ఈనెల 11 నుంచి 15 వరకు జరిగిన సౌత్ ఇండియా న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంటులో ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల క్రికెట్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. టోర్నమెంటులో ఆంధ్రప్రదేశ్ న్యాయవాదులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. రాజుపాలెం మండలం అంచులవారిపాలెం గ్రామ సర్పంచ్, న్యాయవాది అంచుల రామాంజనేయులును భారత క్రికెట్ టీం వికెట్ కీపర్ రిషబ్ పంత్ ప్రత్యేకంగా అభినందించారు. క్రికెట్ టోర్నమెంటులో ప్రతిభ చూపిన రామాంజనేయులును బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారూరి లింగారెడ్డి, పలువురు న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



ముప్పాళ్ల: మండలంలోని కొంకావారిపాలెం గ్రామ సమీపంలోని ప్రైవేటు చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత కొద్ది రోజులుగా అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారు. ఈ సమయంలో ట్రక్కు వెనుక డోర్లు తెరచి ఉండటంతో రోడ్డుపై మట్టి పెళ్లలు పడి వెనుక నుంచి వచ్చే వారికి ఇబ్బందికరంగా మారింది. సమస్యను గ్రామస్తులంతా రెవెన్యూ, పోలీసు దృష్టికి తేవడంతో ఆరు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అబాకస్ పోటీల్లో కృష్ణ వికాస్‌కు ర్యాంక్



సత్తెనపల్లి: వీవీ అబాకస్ పోటీల్లో మూడు జిల్లాల్లో ప్రథమ ర్యాంకు సాధించిన రెడ్డి కృష్ణ వికాస్‌ను బుధవారం ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో కృష్ణ వికాస్ రాష్ట్ర స్థాయిలో ర్యాంక్ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆవోప పట్టణ అధ్యక్షుడు మోటమర్రి చందు, మాజీ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు, ఆర్యవైశ్య యువజన సంఘం సంఘం ట్రెజరర్ బచ్చు సందీప్, రెడ్డి సురేష్, స్వామి ప్రసాద్, దేవరపల్లి రాఘవ, దేవరపల్లి కాశీ విశ్వనాథం, దేవరశెట్టి కిశోర్, శ్రీను, భవాని మెడికల్స్ హరి, పొట్టి మురళి, పేరుమళ్ల శ్రీనివాసరావు, కృష్ణ వికాస్ తండ్రి రెడ్డి శీను పాల్గొన్నారు.

టీబీ రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించండి



సత్తెనపల్లి: టీబీ రోగులకు నాణ్యమైన వైద్య సేవల్ని అందించాలని కేంద్ర ఔషధ విభాగం అధికారిణి డాక్టర్ మితాలి చెప్పారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని టీబీ యూనిట్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. మందుల్ని పరిశీలించి, రికార్డుల నిర్వహణ తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవల్ని అడిగి తెలుసుకున్నారు. అన్ని రికార్డుల, ఆన్‌లైన్‌లో పరిశీలించారు. నిక్షయ ఔషధి యాప్ ద్వారా మందుల నిర్వహణ తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్త పరిచారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ ఎస్‌టీఎస్ ఎన్.స్టాలిన్, ఎంపీహెచ్ఎస్ షేక్ ఇబ్రహీం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి: పట్టణంలో 11 కేవీ లైన్‌లో చెట్లు నరకడం, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పి.రవికిరణ్ బుధవారం తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు. విద్యుత్ సమస్యలపై సత్తెనపల్లి టౌన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబరు 9494116238కు ఫోన్ చేయలని కోరారు.

పార్టీ పటిష్టతకు సచివాలయం కన్వీనర్లే కీలకం

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- చిత్తశుద్ధిగా పనిచేసే వారికి పార్టీ అండ
- బీమాతో ఆర్థిక భరోసా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ క్షేత్రస్థాయి నుంచి పటిష్టంగా ఎన్నికలకు సిద్ధమవ్వాలంటే సచివాలయ కన్వీనర్లే కీలకంగా పని చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. పట్టణంలోని వెంకటేశ్వర గ్రాండ్‌లో బుధవారం జరిగిన సచివాలయ కన్వీనర్ల నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికలకు సచివాలయ కన్వీనర్లను సంసిద్ధులను చేసేందుకు, మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత, ప్రేరణ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. కష్టపడి పనిచేస్తున్న సచివాలయ కన్వీనర్లకు రూ. 10 లక్షల ప్రమాద జీవిత బీమాను వైఎస్సార్ సీపీ అందిస్తోందని చెప్పారు. బీమా ప్రాణంతో సమానం కాకపోయినా కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తుందని వివరించారు. మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఈర్ష్యతో ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. గతంలో ప్రజలకు అందని సంక్షేమం, పరిపాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడప వద్దకు వచ్చిందని తెలిపారు. గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ పార్టీ భవిష్యత్తు కన్వీనర్లు, గృహ సారథుల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో గెలుపు సత్తెనపల్లి నుంచి మొదలవ్వాలని పిలుపు నిచ్చారు. నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు మాట్లాడుతూ చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరావు నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, జెడ్పీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సునీతా రెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ సహారా మౌలాలి, పార్టీ కన్వీనర్లు రాయపాటి పురుషోత్తమరావు, భవనం రాఘవరెడ్డి, నక్క శ్రీనివాస రావు, నియోజవర్గ జేసీఎస్ ఇన్‌చార్జిలు కొణతం స్వాతి, వెంకటరెడ్డి, పులిబండ్ల అశోక్, మేడం ప్రవీణ్ రెడ్డి, నాయకులు బాసులింగారెడ్డి, మర్రి సుబ్బారెడ్డి, ఎం.జె.ఆర్. లింగారెడ్డి, సిరిగిరి గోపాలరావు, నల్లబోతు శివన్నారాయణ, శివరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కరరెడ్డి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలక జైపాల్ పాల్గొన్నారు.

మాటల పాలన కాదు.. చేతల పాలన

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



లబ్ధిదారుడికి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

దొడ్లేరు(క్రోసూరు): గత ప్రభుత్వం మాదిరిగా తమది మాటలు చెప్పి మోసం చేసే పాలన కాదని, అభివృద్ధిని చేసి చూపిస్తున్నామని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని దొడ్లేరులో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల్ని పలకరించారు. మహిళలు ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతించారు. కొంత మంది అభిమానంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంక్షేమ ఫలాలు ఏ విధంగా అందాయో అక్కడి ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. వారు చెప్పిన సమస్యల్ని అక్కడి అధికారులతో మాట్లాడి, పరిష్కరించాలని ఆదేశించారు. తమ నాలుగేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి చూసి ప్రతిపక్షాలు దిక్కుతోచనిస్థితిలో పడ్డాయని తెలిపారు. అందుకే, ఇప్పటికే తాము చేసిన పనుల్ని వాళ్లు ఈసారి చేస్తామని చెప్పుకుంటున్నారని, ప్రజలు కూడా వారి మాటలు విని నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గత నాలుగేళ్లలో దొడ్లేరులో ఊహించని అభివృద్ధి జరిగిందని తెలిపారు. త్వరలోనే డబుల్ లేన్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గత టీడీపీ పాలనలో ప్రజలిచ్చిన హామీల్ని తుంగలో తొక్కి జన్మభూమి కమిటీల పేరుతో దోచుకుందని విమర్శించారు. జగనన్న పాలనలో నేరుగా లబ్ధిదారుల ఖాతాలో సంక్షేమ సాయం జమ అవుతోందని తెలిపారు. పేదల అభ్యున్నతి కోసం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, తనకు అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముక్కు అంజలి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పల్లప్రోలు వెంకటరెడ్డి, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ జమీలా గఫూర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, సయ్యద్ అబ్దుల్ రహీం, ఆవుల అంకిరెడ్డి, ఆవుల నరసింహారెడ్డి, సోము మస్తాన్‌రెడ్డి, ఎంపీటీసీ నాగయ్య, ఖాజా, సయ్యద్ సైదా, మర్రి శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



దేవస్థానంలో మొక్కలు నాటుతున్న పల్నాడు జిల్లా దేవదాయశాఖ అధికారి సత్యనారాయణరెడ్డి

క్రోసూరు: ఆధ్యాత్మికతకు నిలయమైన దేవాలయాల్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పల్నాడు జిల్లా దేవదాయశాఖ అధికారి టి.సత్యనారాయణ రెడ్డి తెలిపారు. క్రోసూరు పరిధిలోని సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, వీరభద్రమల్లేశ్వర స్వామి, ఆంజనేయస్వామి దేవస్థానాల్ని బుధవారం ఆయన సందర్శించారు. రికార్డుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని సత్తెనపల్లి డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లీలావతిని ఆదేశించారు. ప్రభుత్వం అర్చకులకు కల్పిస్తున్న పథకాలపై వారికి అవగాహన కల్పించి లబ్ధి పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఈవోలు విజయభాస్కరరెడ్డి, ముదిగొండ పూర్ణచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అయోధ్యస్వామి ఆరాధనోత్సవం



పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరులో అవధూత అయోధ్య స్వామి 18వ ఆరాధనోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ కమిటీ నిర్వాహకులు కోటేశ్వరమ్మ, రామకృష్ణ తెలిపారు. ఉత్సవాలలో భాగంగా బుధవారం వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఏకాహం నిర్వహించినట్లు పేర్కొన్నారు. గురువారం నగర సంకీర్తన అనంతరం స్వామిని పురవీధుల్లో ఊరేగిస్తామని తెలిపారు. అయోధ్య స్వామి విగ్రహానికి పంచామృత అభిషేకం, విశేష పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

ఫుట్‌బాల్ జట్టుకు హోలీ ఫ్యామిలీ విద్యార్థుల ఎంపిక



సత్తెనపల్లి: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు సత్తెనపల్లి హోలీ ఫ్యామిలీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జోనల్ స్థాయి పోటీలు నిర్వహించారు. పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల నుంచి జట్లు పాల్గొన్నాయి. పల్నాడు జిల్లా తరఫున హోలీ ఫ్యామిలీ పాఠశాల విద్యార్థులు యశ్వంత్, ఎస్.ప్రణీత్, తులసీరామ్ పాల్గొన్నారు. ప్రతిభ చూపడంతో రాష్ట్ర జట్టుకు యశ్వంత్, ఎస్.ప్రణీత్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థుల్ని ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ విజయరాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.అచ్చిరెడ్డి,ఉపాధ్యాయులు అభినందించారు.

అవయవ దానంతో ప్రాణదాతలుగా నిలవాలి

చిలకలూరిపేట: అవయవ దానంతో ప్రాణదాతలుగా నిలవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చిలకలూరిపేట శాఖ అధ్యక్షుడు డాక్టర్ కొల్లా అమర్ చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని చైతన్య లిటిల్స్ స్కూల్ ప్రాంగణంలో అవయవ దానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి అవయవదానం చేయడానికి సిద్ధపడితే ఎనిమిది మంది ప్రాణాలు నిలబెట్టవచ్చని చెప్పారు. కిడ్నీ, లివర్, గుండె, కళ్లు వంటి అవయవాలను దానం చేయవచ్చని తెలిపారు. మరో వైద్యుడు డాక్టర్ కందిమళ్ల వాసుదేవ్ మాట్లాడుతూ మతాచారాలు, మూఢాచారాల నుంచి బయటపడి అవయవదానానికి ముందుకు రావాలని సూచించారు. అవయవ దానంతో చిరంజీవులుగా నిలవాలని తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు కాపు వెంకటరావు, కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, తోటకూర వెంకటనారాయణ, డాక్టర్ పి.వి. సుబ్బారావు, ఈదర గిరీష్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న మాగులూరి ఫౌండేషన్ సభ్యులు

పెదకూరపాడు: మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పెదకూరపాడు, 75 త్యాళ్లూరు, గారపాడు జెడ్పీ పాఠశాలల్లో గత ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సం పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులను ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కిరణ్‌కుమార్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ ప్రతిభ ఉన్న విద్యార్థుల్ని ప్రోత్సహించేందుకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు తమ ఫౌండేషన్ కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పేట్ల పంపిణీ



సుగాలీ కాలనీ జెడ్పీ పాఠశాలలో ప్లేట్లు అందిస్తున్న కౌన్సిలర్ కోటేశ్వరరావు, అమర్



పెద్దమక్కెనలో కెనరా బ్యాంక్ డీడీలు అందుకున్న విద్యార్థులతో ఎంపీటీసీ సభ్యురాలు విజయ్ కుమారి

సత్తెనపల్లి: పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒకటో వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు, అమర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అమర్ ఆధ్వర్యంలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు 500 స్టీల్ ప్లేట్లను వితరణ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, పేరెంట్ కమిటీ చైర్మన్ జె.సుశీలా బాయి, నాయకులు చౌత్రాసుపల్లి నాగబాబు, మాణిక్యరావు, రిటైర్డ్ హెచ్ఎం సీహెచ్. వెంకటాద్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లతా ప్రియదర్శిని పాల్గొన్నారు. సత్తెనపల్లి మండలం పెద్దమక్కెనజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కెనరా బ్యాంక్ విద్యాజ్యోతి సంక్షేమ కార్యక్రమంలో భాగంగా గ్రామ కెనరా బ్యాంక్ మేనేజర్ సూర్యనారాయణ, ఎంపీటీసీ యాంపాటి విజయ్ కుమారి నగదును అందజేశారు. 8,9,10 తరగతుల్లో ఫస్ట్ వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బాలికలకు రూ.5,000 చొప్పున, 5,6,7 తరగతుల్లో ఫస్ట్ వచ్చిన విద్యార్థులకు రూ. 2,500 చొప్పున డీడీలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



గణపవరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రవితేజ నాయక్

రాజుపాలెం: మండలంలోని గణపవరం గ్రామ సచివాలయం-1 పరిధిలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల్ని అందించారు. డాక్టర్ రవితేజ నాయక్ 94 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో 21 మందికి బీపీ, 25 మందికి షుగర్, 22 మందికి బీపీ, షుగర్ మందుల్ని అందించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి, పిల్లలకు పరీక్షలు చేశారు. బరువు తక్కువగా ఉన్న వారికి ప్రత్యేకంగా పోషకాల్ని అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తకు, తల్లిదండ్రులకు తెలిపారు. నలుగురు బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి ఇళ్లకు వెళ్లి పరీక్షలు చేసి, మందుల్ని అందించారు. ఎంఎల్‌హెచ్ బి.అలేఖ్య, ఏఎన్ఎం విమల, ఆశా కార్యకర్తలు దీవెన, సంతోషమ్మ పాల్గొన్నారు.

ముప్పాళ్లలో..

మండలంలోని లంకెలకూరపాడు, గోళ్లపాడు గ్రామాల్లో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ సేవల్ని అందించారు. పీహెచ్‌సీ వైద్యురాలు పి. రమాదేవి 117 మందికి పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందుల్ని అందించారు. అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి వైద్యసేవలందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి, జోస్పిన్ రాణి, పీటర్ డానియేన్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో లభ్యమైన మృతదేహం గుర్తింపు

అచ్చంపేట: మండలంలోని కోనూరు, కస్తల గ్రామాల మధ్యలో గల కృష్ణానదిలో ఈ నెల 12న కన్పించిన మృతదేహం గుర్తింపు లభించింది. అచ్చంపేటకు చెందిన షేక్ హుస్సేన్ కుమారుడు ఉస్మాన్(14) గా బుధవారం పోలీసులు గుర్తించారు. ఉస్మాన్ హోటల్లో సర్వర్‌గా పనిచేస్తూ ఈనెల 11న స్నేహితులు రబ్బాని, సైదా అలియాస్ పండులతో కలసి కోనూరు కృష్ణానదిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఉస్మాన్ కనిపించక పోవడంతో చేసేది లేక మిగిలిన ఇద్దరు ఇంటికి వెళ్లారు. కుమారుడి ఆచూకీ గురించి హుస్సేన్ వెతుకుతుండగా, దినపత్రికల్లో వచ్చిన వార్త సహాయంతో పోలీసుల్ని ఆశ్రయించారు. మార్చురీలో ఉన్న మృతదేహం తన కుమారుడు ఉస్మాన్‌దిగా ఆయన గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు.

ఏరియా వైద్యశాలలో కార్పొరేట్ దంత వైద్య సేవలు



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో కార్పొరేట్ స్థాయి దంత వైద్య సేవలు ఉచితంగా అందుతున్నాయని అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ చెప్పారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో బుధవారం అధునాతన దంత వైద్య సేవలు నూతనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గతంలో ఆస్పత్రిలో పళ్లు పీకడం, సిమెంటు పెట్టడం వంటి సేవలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పుడు కొత్త దంతాలు పెట్టడం, పూర్తి పళ్ల సెట్ అమర్చడం, అవసరమైన వారికి స్టీల్ క్లిప్పులు వేయడం వంటి సేవలు అందుబాటులోకి రావడంతో పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. అదే పళ్ల సెట్టు బయట పెట్టించుకుంటే వేల రూపాయలు ఖర్చు అవుతాయని, ఇప్పుడు ఏరియా వైద్యశాలలో పూర్తిగా ఉచితంగా అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. ముఖ్యంగా మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవతో ఈ సేవలు అతి త్వరగా అందుబాటులోకి వచ్చాయని వివరించారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి



జెడ్పీ చైర్మన్ హెనీ క్రిస్టీనాకు నియోజకవర్గ సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: నియోజకవర్గ అభివృద్ధికి జెడ్పీ నిధులు రూ. 2 కోట్లు కేటాయించాలని జిల్లా పరిషత్ చైర్మన్ హెనీ క్రిస్టీనాను పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. గుంటూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం హెన్రీ క్రిస్టీనాతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమావేశమయ్యారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. ప్రధానంగా మంచినీటి సమస్య ఉన్న గ్రామాల్లో ఫిల్టర్ బెడ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి మండలంలోని ధరణికోట, క్రోసూరు మండలంలోని క్రోసూరు ఊటుకూరు, అచ్చంపేట మండలంలోని వేల్పూరు, పెదకూరపాడు మండలంలో కంభంపాడు గ్రామాల్లో ఫిల్టర్ బెడ్లనిర్మాణం కోసం నిధులు విడుదల చేయాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న ఎస్సీ, ముస్లిం కమ్యూనిటీ హాళ్లు, ప్రహరీలు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన క్రిస్టీనా వెంటనే రూ.1.10 కోట్లను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. మిగిలినవి త్వరలోనే మంజూరు చేస్తామని చెప్పారు.

విద్యార్థులంతా సాంకేతిక రంగాల్లో రాణించాలి



వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సాంబిరెడ్డి

పెదకూరపాడు: విద్యార్థులంతా సాంకేతిక రంగాల్లో రాణించాలని క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి సూచించారు. మండలంలోని 75 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం శ్రీరీనా టెక్నాలజీస్ ఆధ్వర్యంలో రోబోటిక్ కోడింగ్ ప్రోగ్రాంపై వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాంబిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులంతా నూతన టెక్నాలజీపై అవగాహన పెంచుకోవడం వల్ల భవిష్యత్తులో సృజనాత్మక ఆలోచనా విధానాలు కలిగి ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ ఎలక్ట్రానిక్ వస్తువులు, ఎలక్ట్రికల్ అలారం, టేబుల్ ఫ్యాను తయారు చేశారు. రోబోటిక్ ద్వారా ఫుట్‌బాల్ గేమ్ ఆడారు. వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో శ్రీరీనా టెక్నాలజీస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, శ్రీక్రాంత్, అమరోన్‌ఫ్‌రెడ్డి, పవన్, నితిన్, కార్తికేయ, పూజ, ఎంఈవో సత్యనారాయణ, హెచ్ఎం అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, పేరంట్స్ కమిటీ చైర్మన్ జి.శ్రీనివాస రెడ్డి, ఈదా కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి



ఈ-పంట నమోదును పర్యవేక్షిస్తున్న ఏవో వేణుగోపాల్



నందిగామలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఏవో శ్రీధర్‌రెడ్డి

క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ–పంట నమోదు ప్రారంభమైందని, రైతులంతా తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని ఆవులవారిపాలెంలో బుధవారం పంట నమోదును ఆయన పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ- పంట నమోదు చేసుకోవడం వల్ల ఉచిత పంటల బీమా, పంట నష్టపరిహారం, సున్నావడ్డీ పంట రుణం, కనీస మద్దతు ధర వంటి ప్రయోజనాలు చేకూరుతాయని చెప్పారు.

మండలంలో ఇప్పటికీ 4488 హెక్టార్లలో పత్తి, 7.14లో హెక్టార్ల కంది, 0.40 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు తెలిపారు. సాగు చేస్తున్న రైతులంతా పొలం పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా, ఆధార్ ఫొటోస్టాట్‌తో పాటు ఫోన్ నంబర్‌తో గ్రామ రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సంప్రదించి, ఈ- పంట నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

సత్తెనపల్లిలో..

రైతులందరూ తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేయించుకోవాలని సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి యస్.శ్రీధర్ రెడ్డి చెప్పారు. సత్తెనపల్లి మండలం నందిగామలో క్షేత్రస్థాయిలో సిబ్బందితో ఈ–పంట నమోదుతో పాటు పంట పొలాల్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ- పంట నమోదు చేసుకోవడం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయని తెలిపారు. పంటకు గిట్టుబాటు ధర, రుణాలకు సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, పంటల నష్ట పరిహారం అందడానికి ప్రతి రైతూ చేయించుకోవాలని ఆయన సూచించారు. సాగు చేస్తున్న పంటల్ని భూ యజమాని, కౌలు రైతులు తప్పకుండా గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్దకు వెళ్లి సిబ్బందితో నమోదు చేయించుకోవాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు గోపాలం గోపీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

నకరికల్లు: మండలంలోని చేజర్ల యానాది కాలనీ సమీపంలో పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ఏ.బాలకృష్ణ బుధవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 5,400 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పేకాట, కోడిపందాలు, బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.